క్లుప్తంగా

విద్యార్థులకు క్రీడా దుస్తుల పంపిణీ



దుస్తులు అందజేసిన దృశ్యం

ప్యాపిలి: మండల పరిధిలోని జలదుర్గం ఉన్నత పాఠశాలకు చెందిన క్రీడాకారులకు శనివారం టీషర్టులను పంపిణీ చేశారు. బుగ్గన యువ సేన ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో కోఆప్షన్ మెంబర్ అబ్దుల్ రసూల్, వైఎస్సార్ సీపీ నాయకులు కొండారెడ్డి తదితరులు విద్యార్థులకు దుస్తులు అందజేశారు. కార్యక్రమంలో విద్యా కమిటీ చైర్మన్ గవ్వల నాగరాజు, ఏపీ ఎమ్మార్పీఎస్ నంద్యాల జిల్లా అధ్యక్షుడు రాశిపోగుల ఓబయ్య తదితరులు పాల్గొన్నారు.

సేవాగుణం అలవర్చుకోవాలి



లబ్ధిదారులకు ఫించన్లు అందజేస్తున్న దృశ్యం

కోవెలకుంట్ల: ప్రతి ఒక్కరూ సేవా గుణం అలవర్చుకుని తమ సంపాదనలో కొంత మొత్తాన్ని దానధర్మాలకు వెచ్చించాలని ప్రక్కతిపీఠం అధ్యక్షుడు, రిటైర్డ్ లైబ్రేరియన్ పల్లె నరసింహారెడ్డి పిలుపునిచ్చారు. అనాథలు, వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులకు ప్రతి నెలా అందజేసే పింఛన్ల ప్రక్రియను శనివారం స్థానిక పరంధామ నిలయంలో చేపట్టారు. పట్టణానికి చెందిన 150 మందికి ఒక్కొక్కరికి రూ. 100 చొప్పున అందజేశారు. కార్యక్రమంలో మాజీ సైనిక ఉద్యోగి పెద్దిరెడ్డి, రిటైర్డ్ హెచ్ఎం నారాయణస్వామి, వాల్మీకి సంఘం నాయకుడు సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటి ఓటర్ల సర్వే పరిశీలన



ఓటర్ల వివరాలను పరిశీలిస్తున్న తహసీల్దార్

కోవెలకుంట్ల: స్థానిక మేజర్ గ్రామ పంచాయతీ పరిధిలో గత నెల 21 నుంచి కొనసాగుతున్న ఇంటింటి ఓటర్ల సర్వేను శనివారం తహసీల్దార్ పుష్పకుమారి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో ఓటర్ల జాబితా సర్వేను పకడ్బందీగా చేపట్టాలన్నారు. 18 సంవత్సరాలు నిండిన యువతి, యువకులకు కొత్తగా ఓటు నమోదుతోపాటు ఓటర్ల జాబితాలో మార్పులు, చేర్పులు, తొలగింపులు, సవరణలు చేసుకునేందుకు ఈ నెల 21వ తేదీ వరకు అవకాశం ఉందని తెలిపారు.

సమరత ఆధ్వర్యంలో ఆధ్యాత్మిక కార్యక్రమాలు

కోవెలకుంట్ల: శ్రావణ మాసాన్ని పురస్కరించుకుని సమరత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆలయాల్లో ఆధ్యాత్మిక కార్యక్రమాలు చేపడుతున్నామని ఆ సంస్థ జిల్లా కన్వీనర్ తిమ్మారెడ్డి తెలిపారు. శనివారం స్థానిక పాండురంగ స్వామి దేవాలయ ఆవరణలో ఆ సంస్థ ఆగస్టు నెలలో చేపట్టే కార్యక్రమాలపై నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అధిక శ్రావణమాసం కావడంతో రెండు పర్యాయాలు పౌర్ణమి వస్తుందన్నారు. అన్ని ఆలయాల్లో సామూహిక హారతులు ఇవ్వాలన్నారు. ఈ నెలలో జరిగే పంద్రాగస్టు, ఏకాదశి నగర సంకీర్తన, తులసీదాస్ జయంతి కార్యక్రమాలను ఘనంగా నిర్వహించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో సంస్థ మండల కన్వీనర్ గార్లపాటి జగదీశ్వరరెడ్డి, జిల్లా ప్రచార కార్యదర్శి వెంకటసుబ్బయ్య, సభ్యులు రవీంద్రనాథరెడ్డి, వెంకటసుబ్బారెడ్డి, సుబ్రమణ్యం, నాగలక్ష్మి, లక్ష్మీదేవి, నాగేష్, తదితరులు పాల్గొన్నారు.

నంద్యాలకు వెళ్లి పింఛన్ అందజేత



నాగేంద్రమ్మకు పింఛన్ సొమ్ము అందజేస్తున్న వలంటీర్ మమత

అవుకు: మండల కేంద్రం అవుకు పట్టణానికి చెందిన బచ్చు నాగేంద్రమ్మ కొన్ని రోజులుగా అనారోగ్యంతో నంద్యాలలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతుంది. ఈ మేరకు వలంటీర్ మమత శనివారం నంద్యాలకే వెళ్లి నాగేంద్రమ్మకు వితంతు పింఛన్ సొమ్ము అందజేశారు. వలంటీర్‌కు లబ్ధిదారురాలితోపాటు బంధువులు కృతజ్ఞతలు తెలిపారు.

సారా విక్రేత అరెస్టు

డోన్ టౌన్: మండల పరిధిలోని దేవరబండలో నాటు సారా విక్రయిస్తున్న ఎరుకలి వెంకట్రాముడిని అరెస్టు చేసినట్లు రూరల్ ఎస్ఐ సుధాకర్ రెడ్డి తెలిపారు. గ్రామంలో ఇంటి వద్ద సారా విక్రయిస్తున్న సమాచారం మేరకు అదుపులోకి తీసుకున్నామన్నారు. 15లీటర్ల నాటు సారాను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

జగనన్న సురక్ష.. తీరిన సమస్యలు!

- ఉచితంగా ధ్రువీకరణ పత్రాలు అందజేసిన ప్రభుత్వం
- నియోజకవర్గంలో 48,233 సర్టిఫికెట్ల పంపిణీ
- ఏళ్లతరబడి నెలకొన్న ఇబ్బందులు తొలగిన వైనం
- సంతోషం వ్యక్తం చేస్తున్న ప్రజలు



తిమ్మాపురం గ్రామ సచివాలయంలో ధ్రువీకరణ పత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి(ఫైల్)

బనగానపల్లె: ప్రజల వద్దకే పాలన లక్ష్యంగా సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పౌర సేవలపై ప్రత్యేక దృష్టి సారించింది. దాదాపు అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందజేసినప్పటికీ సాంకేతిక... ధ్రువీకరణ పత్రాలు లేకపోవడం మూలంగా ప్రభుత్వ పథకాలు అందని పేదలకు న్యాయం చేసేందుకు.. ప్రజలకు అవసరమైన సర్టిఫికెట్లు అందజేసేందుకు సీఎం వైఎస్ జగన్‌మోన్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా జగనన్న సురక్ష కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. జూలై 1 నుంచి నెలపాటు సాగిన ఈ కార్యక్రమానికి అన్నివర్గాల ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. మండలస్థాయి అధికారులు రెండు బృందాలుగా ఏర్పడి అప్పటికే వలంటీర్, సచివాలయ ఉద్యోగులు సేకరించిన వివరాల మేరకు ప్రజలకు ఉచితంగా అప్పటికప్పుడే ధ్రువీకరణ పత్రాలు అందజేయడంతో లబ్ధిదారులు సంతోషం వ్యక్తం చేశారు. ఆదాయ, కులం, జనన, మరణ, వివాహ ధ్రువీకరణ సర్టిఫికెట్లతో పాటు కొత్తరేషన్ కార్డులు, కౌలు రైతు కార్డులు, ఫ్యామిలి మెంబర్ సర్టిఫికెట్లు, ఆధార్ కార్డులో ఫోన్‌నంబరు అప్‌డేట్ తదితర 11 రకాల సేవలు ప్రజలకు అందాయి.

బనగానపల్లె నియోజికవర్గంలో 82 క్యాంపులు

జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా రెండు బృందాలుగా ఏర్పడిన అధికారులు బనగానపల్లె నియోజకవర్గంలో 82 క్యాంపులు నిర్వహించి ప్రజలకు 48,233 ధ్రువీకరణ పత్రాలను ఉచితంగా అందజేశారు. వలంటీర్ల సహకారంతో కొందరు నిరక్షరాస్యులు సైతం తమకు కావాల్సిన సర్టిఫికెట్లు అందుకున్నారు. కార్యాలయాలు, అధికారుల వద్దకు వెళ్లకుండానే సర్టిఫికెట్లు ఉచితంగా అందజేయడంతో ప్రజల నుంచి హర్షాతిరేకాలు వెల్లువెత్తాయి. ప్రత్యేకించి విద్యార్థులు ఎంతో సంతోషించారు. ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి కార్యక్రమాలకు హాజరై ప్రజలకు అవసరమైన సర్టిఫికెట్లను అందజేశారు. బనగానపల్లె మండలం 21,293 ధ్రువీకరణ పత్రాలు పంపిణీ చేయడంతో జిల్లాలోనే మొదటిస్థానం నిలిచింది. అదేవిధంగా ఇల్లూరు కొత్తపేట గ్రామసచివాలయ పరిధిలో 2,099 ధ్రువీకరణ పత్రాలు అందజేసి జిల్లాలో మొదటి మొదటిస్థానం సాధించినట్లు సంబంధిత అధికారులు పేర్కొంటున్నారు.

మండలాల వారీగా పంపిణీ చేసిన ధ్రువీకరణ పత్రాలు

మండలం	ధ్రువీకరణ పత్రాలు
బనగానపల్లె	21,293
కోవెలకుంట్ల	3,782
అవుకు	6,193
కొలిమిగుండ్ల	14,772
సంజామల	2,193

గతంలో తప్పని అగచాట్లు..

ధ్రువీకరణ పత్రాల కోసం గతంలో అగచాట్లు తప్పేవికావు. అధికారుల సంతకాలు సేకరించి దరఖాస్తు చేసుకున్నా సకాలంలో అందక ప్రజలు చాలా ఇబ్బందులే పడ్డారు. తహసీల్దార్ కార్యాలయం వద్ద ఉదయం నుంచి సాయంత్రం వరకు నిరీక్షించినా ఫలితం దక్కని సందర్భాలు కోకొల్లలు. అధికారులు లేరని, పత్రాలు సరిగా లేవని సర్టిఫికెట్లు ఇవ్వని సందర్భాలు లేకపోలేదు. మళ్లీ దరఖాస్తు చేసుకుంటూ పడరానిపాట్లు పడ్డారు జనం. ప్రత్యేకించి బర్త్, డెత్ సర్టిఫికెట్ల మంజూరు కావాలంటే నెలల తరబడి తిరిగినా కాలాలు ఉన్నాయి. అయినా వస్తుందనే నమ్మకం లేదు. ఇలాంటి సమయంలో ప్రభుత్వం జగనన్న సురక్ష కార్యక్రమంతో అడిగిన మరుసటిరోజే ఉచితంగా ప్రజలకు కావాల్సిన సర్టిఫికెట్స్ అందజేయడంతో అన్నివర్గాల నుంచి హర్షాతిరేకాలు వెల్లువెత్తుతున్నాయి. గతంలో పడిన ఇబ్బందులను గుర్తుచేసుకుని నిట్టూర్చిన ఆయా గ్రామాల ప్రజలు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలుపుతున్నారు.

ఫ్యామిలి మెంబర్ ధ్రువీకరణ పత్రం సమస్య తీరింది



నా భర్త కట్టుబడి ఉచ్చు బాషా రెండునెలల క్రితం మృతి చెందారు. అయితే ప్రభుత్వ పథకాలతో పాటు ఇతర ఆస్తి పంపకాలకు ఫ్యామిలి మెంబర్ ధ్రువీకరణ పత్రం కోసం ఆలోచిస్తున్న సమయంలో వలంటీర్ మా ఇంటి వద్దకే వచ్చి వివరాలు సేకరించారు. జగనన్న సురక్ష కార్యక్రమంలో ఫ్యామిలి మెంబర్ పత్రాన్ని ఉచితంగా అందజేశారు. ఈ సదుపాయంలేకుంటే 15 కిలోమీటర్ల దూరంలో బనగానపల్లెకు వెళ్లి ఇబ్బందులు పడాల్సి వచ్చేది. ప్రభుత్వ సాయం బాగుంది.

– కట్టుబడి జైనాబీ, జిల్లెల్ల గ్రామం, బనగానపల్లె మండలం

ప్రజలకు ధ్రువీకరణ పత్రాల అందజేత తృప్తినిచ్చింది



వివిధ శాఖల అధికారులు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్ల సమష్టి కృషితో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని విజయవంతం చేశాం. అందరి సహకారంతో సర్టిఫికెట్ల పంపిణీలో బనగానపల్లె మండలం నంద్యాల జిల్లాలో ప్రథమస్థానం, సచివాయాల పరిధిలో ఇల్లూరుకొత్తపేట సచివాలయ ప్రథమస్థానం సాధించింది. ప్రజలకు కావాల్సిన ధ్రువీకరణ పత్రాలను ఉచితంగా అందజేయడం వ్యక్తిగతంగా కూడా ఎంతో తృప్తినిచ్చింది.

– శివరామయ్య ఎంపీడీఓ, బనగానపల్లె మండలం

ట్రిపుల్ ఐటీకి రాచర్ల విద్యార్థిని ఎంపిక

ప్యాపిలి: మండల పరిధిలోని రాచర్ల ఉన్నత పాఠశాలకు చెందిన తులసి శ్రీకాకుళంలోని ట్రిపుల్ ఐటీకి ఎంపికైంది. గత ఏప్రిల్‌లో జరిగిన పదో తరగతి పరీక్షల్లో తులసి 555 మార్కులు సాధించింది. తులసి ట్రిపుల్ ఐటీకి ఎంపిక కావడం గర్వకారణం హెచ్ఎం ఉమాదేవి సంతోషం వ్యక్తం చేశారు. అదే విధంగా విద్యాకమిటీ చైర్మన్ ధనుంజయరెడ్డి, ఉపాధ్యాయులు విజయలక్ష్మి, వెంకటశేషయ్య, లక్ష్మానాయక్, షకీలా బేగం తదితరులు తులసిని అభినందించారు.

బెల్లం ఊట ధ్వంసం

ప్యాపిలి: మండల పరిధిలోని సీతమ్మతండా శివారు ప్రాంతంలో సెబ్ అధికారులు శనివారం నాటు సారా స్థావరాలపై దాడులు నిర్వహించారు. నాటుసారా తయారీకి ఉపయోగించే 1500 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేసినట్లు ఎన్‌ఫోర్స్‌మెంట్ ఇన్‌స్పెక్టర్ భీమలింగ తెలిపారు. ముడావత్ రాజునాయక్, రాంభూపాల్ నాయక్ తదితరులను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు. సబ్ ఇన్‌స్పెక్టర్ బాల నరసింహారెడ్డి, హెడ్ కానిస్టేబుల్‌లు రమణ, జయుడు తదితరులు పాల్గొన్నారు.

త్రివర్ణ కాలనీలో విద్యుత్‌లైన్ మార్పు

డోన్ : స్థానిక త్రివర్ణ కాలనీవాసులు చిరకాలంగా ఎదుర్కొంటున్న విద్యుత్ సమస్యను మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి చొరవతో పరిష్కారమైందని కౌన్సిలర్ నాగేంద్ర తెలిపారు. గత 50 ఏళ్ల నుండి త్రివర్ణకాలనీకి చెందిన ఇళ్లపై రైల్వేకు సంబంధించి 11 కేవీ విద్యుత్ లైన్ వెళ్లడం మూలంగా కొందరు మృతి చెందారన్నారు. మంత్రి బుగ్గన దృష్టికి తీసుకురావడంతో ఆయన గుంతకల్ రైల్వే డీఆర్ఎంతో చర్చించి 11కేవీ విద్యుత్ లైన్‌ను ఇళ్లపై కాకుండా పక్కన ఏర్పాటుచేసేందుకు ప్రయత్నించారన్నారు. దీంతో యుద్ధప్రాతిపదికన రైల్వేకు సంబంధించి విద్యుత్ అధికారులు లైన్‌ను మార్చడంపై కాలనీవాసులు మంత్రి బుగ్గనకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నారని కౌన్సిలర్ నాగేంద్ర తెలిపారు.

ప్రతి ఇంటికీ కుళాయి కనెక్షన్



- జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి

మాట్లాడుతున్న జెడ్పీచైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి

కొలిమిగుండ్ల: జల్‌జీవన్ మిషన్ పథకం కింద కొలిమిగుండ్ల మండలంలోని ప్రతి ఇంటికీ కుళాయి కనెక్షన్ ఇవ్వడమే లక్ష్యంగా పెట్టుకున్నామని జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి పేర్కొన్నారు. శనివారం స్థానిక కార్యాలయంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సుబ్రహ్మణ్యంతో పాటు మండలంలోని సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా జెడ్పీ చైర్మన్ మాట్లాడుతూ గ్రామాల్లో తాగునీటి సమస్య లేకుండా చేస్తే ప్రజాప్రతినిధులుగా మనకు మంచి పేరు వస్తుందని సూచించారు. ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి సహకారంతో జల్‌జీవన్ కింద మండలంలోని 33 గ్రామాలకు రెండు విడతల్లో రూ.20 కోట్ల నిధులు మంజూరు చేయించామన్నారు. మొదటి విడతలో ఆరు గ్రామాల్లో ఇప్పటికే ఓవర్‌హెడ్ ట్యాంక్‌ల నిర్మాణం పూర్తయ్యాయని, రెండో విడతలో మిగిలిన గ్రామాల్లో ప్రాధాన్యత మేరకు ట్యాంక్‌లతో పాటు పైపులైన్ నిర్మాణం చేపడుతామని చెప్పారు. ఈపనులన్నీ పూర్తి చేస్తే భవిష్యత్‌లో తాగునీటి సమస్య లేకుండా పోతుందన్నారు. ప్రతి గ్రామంలో పనులు చేసి ఇంటింటికీ కుళాయి కనెక్షన్ ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కొలిమిగుండ్ల, పెట్నికోట, తుమ్మలపెంటలోని జగనన్న కాలనీలకు ఓవర్‌హెడ్ ట్యాంక్‌లు మంజూరైనట్లు గుర్తు చేశారు. జల్‌జీవన్ కింద గ్రామాల వారీగా మంజూరైన నిధుల వివరాలను వివరించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు అంబటి గుర్విరెడ్డి,జిల్లా సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు లాయర్ మహేశ్వర రెడ్డి,జిల్లా ప్రచార విభాగం అధ్యక్షుడు పేరం సత్యనారాయణరెడ్డి, మండల ఉపాధ్యక్షుడు కృష్ణారెడ్డి, సీనియర్ నాయకుడు సత్తిగారి రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గృహ నిర్మాణాల పరిశీలన

సంజామల: మండల పరిధిలోని ఆకుమల్ల, పేరుసోముల గ్రామాలలో జగనన్న కాలనీల్లో జరుగుతునన గృహనిర్మాణాలను శనివారం ఇంజినీర్ అసిస్టెంట్ ప్రేమ్‌నాథ్‌తో కలిసి హౌసింగ్ ఏఈ బాల చంద్రుడు పరిశీలించారు. లబ్ధిదారులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సకాలంలో బిల్లులు మంజూరు అవుతున్నాయని, త్వరగా ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసుకుని సొంతింటి కల సాకారం చేసుకోవాలని లబ్ధిదారులకు ఏఈ సూచించారు.



జగనన్న కాలనీలో పరిశీస్తున్న ఏఈ బాల చంద్రుడు

ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ



మాట్లడుతున్న ఏంపిడీఓ నాగకుమార్

సంజామల: మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలు, కళాశాల పిల్లలందరికీ ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేయాలని ఎంపీడీఓ నాగకుమార్ సూచించారు.మండల ప్రజా పరిషత్ కార్యలయంలో శనివారం జరిగిన విద్య, వైద్య అధికారుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అనంతరం నూలిపురుగుల పట్ల అవగాహన కల్పిస్తూ,ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సంజామల, పేరుసోముల డాక్టర్లు వినోద్ కుమార్, శ్రీనివాస్, ఏఓ విజయకుమార్ రెడ్డి, ఏంఈఓ శంకర్ పాల్గొన్నారు.

7న తిరుపతిలో ఓబీసీ మహాసభ



పోస్టర్లు విడుదల చేస్తున్న నాయకులు

డోన్ : తిరుపతిలో ఈనెల 7వ తేదీన నిర్వహించే జాతీయ ఓబీసీ మహాసభను జయప్రదం చేయాలని రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం కార్యదర్శి శీలం భాస్కర్‌నాయుడు కోరారు. తన కార్యాలయంలో శనివారం బీసీ సంఘం నాయకులతో కలిసి మహాసభకు సంబంధించిన పోస్టర్లను ఆయన విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశవ్యాప్తంగా జనగణనతో పాటు కుల గణన కూడా చేయాలని ఆయన డిమాండ్ చేశారు. సమావేశంలో నాయకులు క్రిష్ణమూర్తి, శివరామక్రిష్ణ, ప్రతాప్‌నాయుడు, ప్రభాకర్, తిమ్మయ్య, రామాంజనేయులు, సురేష్, శేషావలి, రోహిత్, సుంకన్న, గోపాల్, నరసింహులు, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

మహాసభలను విజయవంతం చేయండి

డోన్ టౌన్ : విజయవాడలోని ఇందిరా గాంధీ మున్సిపల్ స్టేడియంలో ఈనెల 21న జరగనున్న ఏపీ రాష్ట్ర నాన్ గెజిటెడ్ అధికారుల సంఘం 21వ మహా సభలను విజయవంతం చేయాలని ఆ సంఘం డోన్ డివిజన్ అధ్యక్షులు షమీముల్లా తెలిపారు. రాష్ట్ర మహా సభలకు సంబంధించిన విషయాలు చర్చించేందుకు స్థానిక కార్యాయలంలో శనివారం సాయంత్రం అత్యవసర సమావేశం నిర్వహించారు. మహా సభలకు సీఎంతో పాటు పలువురు మంత్రులు హాజరుకానున్నారని చెప్పారు. మహా సభల పోస్టర్లను విడుదల చేశారు. అనంతరం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న అశోక్‌ను ఉపాధ్యక్షులుగా, లక్ష్మీబాయ్‌ను సహాయ కార్యదర్శులుగా ఏక గ్రీవంగా ఎన్నుకున్నారు.

సంపూర్ణ పోషణ కిట్ల పంపిణీ

బనగానపల్లెరూరల్: మండలంలోని పసుపల గ్రామ పంచాయతీలోని పసుపల, చిన్నరాజు పాళెం, కాలేనాయక్‌తాండా గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో శనివారం సర్పంచ్ మోహన్‌బాబు చేతుల మీదుగా గర్భిణులు, బాలింతలకు వైఎస్సార్ సంపూర్ణపోషణ కిట్లను పంపిణీ చేశారు.

తల్లిపై కొడుకు, కోడలు దాడి

బేతంచెర్ల: ఆస్తి విషయంలో మండల పరిధిలోని మండ్లవానిపల్లె గ్రామానికి చెందిన మంటి నాగమ్మపై కొడుకు భూపాలు, కోడలు తిరుపాలమ్మ, ఇద్దరు మనుమండ్లు గొడవ పెట్టుకొని దాడిచేసి గాయపరిచారు. బాధితురాలు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శివ శంకర్ నాయక్ శనివారం తెలిపారు.

శ్రీ మద్దిలేటి నరసింహ స్వామికి ప్రత్యేక పూజలు

బేతంచెర్ల : మండల పరిధిలోని ఆర్ఎస్ రంగాపురం శివారులో వెలసిన శ్రీలక్ష్మీ గణమద్దిలేటి నరసింహస్వామి అధిక శ్రావణ శనివారం పురస్కరించుకొని భక్తులు స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ పుష్కరిణిలో భక్తులు పుణ్యస్నానాలు చేసి స్వామి వార్లకు అభిషేకం, కుంకుమార్చన, వరపూజ, ఆకుపూజ నిర్వహించారు. వివిధ సేవల ద్వారా రూ.4,58,615 ఆదాయం వచ్చినట్లు ఈఓ పాండు రంగారెడ్డి, చైర్మన్ రామచంద్రుడు తెలిపారు.

ఆరోగ్యంపై అప్రమత్తంగా ఉండాలి

కోవెలకుంట్ల: యుక్తవయస్సు బాలికలు ఆరోగ్య విషయంలో అప్రమత్తంగా ఉండాలని చైల్డ్‌ఫండ్ ఇండియా ప్రాజెక్టు కో ఆర్డినేటర్ ఖాదర్‌బాషా సూచించారు. శనివారం పట్టణంలోని ఆ ప్రాజెక్టు కార్యాలయంలో బాలికలకు వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ సుబ్బమ్మ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కిషోర బాలికలు ఎప్పటికప్పుడూ ఆరోగ్యవిషయాల్లో సూచనలు, సలహాలు పాటించాలన్నారు.

ఉపాధ్యాయుల జీతాలు చెల్లించాలి

ప్యాపిలి: బదిలీలు, పదోన్నతులు పొందిన ఉపాధ్యాయులకు ప్రభుత్వం వెంటనే జీతాలు చెల్లించాలని యూటీఎఫ్ నాయకులు బొజ్జన్న, నరసింహారెడ్డి, అబ్దుల్ లతీఫ్ తదితరులు శనివారం ఒక ప్రకటనలో కోరారు. బదిలీలు, పదోన్నతులు యుద్ధప్రాతిపదికన పూర్తి చేసిన ప్రభుత్వం జీతాలు ఇప్పటివరకు చెల్లించకపోవడం బాధాకరమన్నారు. అధికారులు తమ అలసత్వాన్ని వీడి వెంటనే జీతాలు చెల్లించాలని వారు కోరారు.

మొక్కలు నాటి సంరక్షించాలి

బేతంచెర్ల: ఉపాధి హామీ పథకం కింద రహదారులకు ఇరువైపులా మొక్కలు నాటడంతోపాటు బాధ్యతగా సంరక్షించాలని ఏపీడీ శ్రీవిద్య సూచించారు. మండల పరిధిలోని గోరుమానుకొండకు వెళ్లే రహదారిలో ఇరువైపులా నాటిన మొక్కలను సర్పంచ్ కోడె వెంకటేశ్వర్లుతో కలిసి ఆమె పరిశీలించారు. మొక్కలకు క్రమం తప్పకుండా నీరుపోసి సంరక్షించాలని ఉపాధి సిబ్బందికి ఏపీడీ సూచించారు.

వ్యక్తిగత శుభ్రత పాటించాలి

బేతంచెర్ల: ప్రతి ఒక్క విద్యార్థి ఆరోగ్యంగా ఉండాలంటే వ్యక్తిగత, పరిసరాల శుభ్రత పాటించాలని వైద్యులు రాజేష్ సూచించారు. శనివారం పట్టణంలోని సరస్వతీ శిశుమందిర్ విద్యార్థులకు వైద్యులు రాజేష్ కళ్లకలక వచ్చిన వారు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ మద్దిలేటిస్వామి, కార్యదర్శి మధు మోహన్‌రెడ్డి, హెచ్ఎం బాల వెంకట రమణ పాల్గొన్నారు.

పన్ను నగదు రహితంగా స్వీకరించాలి

ప్యాపిలి: ఇక నుంచి గ్రామ పంచాయతీలకు ప్రజలు చెల్లించే అన్ని రకాల పన్నులు నగదు రహితంగానే స్వీకరించాలని ఈఓఆర్డీ బాలకృష్ణుడు అన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో శనివారం ఆయన పంచాయతీ కార్యదర్శులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఈఓఆర్డీ మాట్లాడుతూ కార్యదర్శులు యూనియన్ బ్యాంకులో పంచాయతీ పేరిట ఖాతా ప్రారంభించాలన్నారు. యాప్‌కు సంబంధించిన క్యూఆర్ కోడ్ పంచాయతీ కార్యాలయాల్లో ప్రజలకు అందుబాటులో ఉంచాలన్నారు. ఆగస్టు 15 వ తేదీ నుంచి కుళాయి పన్ను, ఇంటి పన్ను ఇతర చెల్లింపులను ప్రజలు క్యూఆర్ కోడ్ స్కాన్ చేసి తద్వారా చెల్లించేలా చూడాలన్నారు. యూనియన్ బ్యాంకు మేనేజర్ కైసర్ బాషా పంచాయతీ కార్యదర్శులకు బ్యాంకు ఖాతా ప్రారంభించే విధానంపై అవగాహన కల్పించారు. సమావేశంలో పంచాయతీ కార్యదర్శులు శివకుమార్ గౌడ్, నాగయ్య, శకుంతల, కిరణ్, గిరి, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలు పూర్తిచేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న చైర్మన్ రాజేష్

డోన్ : పట్టణ శివారులోని జగనన్న కాలనీలలో లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలని మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్ సూచించారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో శనివారం గృహ నిర్మాణాలపై హౌసింగ్ అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉడుములపాడు, దొరపల్లె జగనన్న లేఅవుట్లలో గృహ నిర్మాణాలు పూర్తయ్యేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ రెండు లేఅవుట్లలో 3,350 మంది లబ్ధిదారులకు ప్రభుత్వం ఇంటి నివేశ స్థలాలతో పాటు గృహనిర్మాణానికి రుణాన్ని కూడా మంజూరు చేసిందన్నారు. ఇప్పటికే విద్యుత్ స్తంభాల ఏర్పాటు పూర్తిచేసి విద్యుత్ సౌకర్యం కూడా కల్పించడం జరిగిందన్నారు. 950 మంది లబ్ధిదారుల ఇళ్లకు ఉచితంగా మీటర్లను బిగించడం జరిగిందన్నారు. లోతట్టు ప్రాంతాల్లో కల్వర్టుల నిర్మాణం కూడా పూర్తిచేశామని, త్వరలోనే సీసీ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణాలను చేపడతామని ఆయన తెలిపారు. సమావేశంలో కమిషనర్ వెంకట్రామిరెడ్డి, హౌసింగ్ డీఈ రాజశేఖర్, ఏఈ వీరేంద్ర, మున్సిపల్ ఏఈ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమం, అభివృద్ధిని చూసి ఆదరించాలి



యంబాయి గ్రామ ప్రజలతో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

బేతంచెర్ల: సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధిని చూడాలని, వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీని మరో మారు ఆదరించాలని యంబాయి గోరుమానుకొండ గ్రామాల సర్పంచులు యుగంధర్‌రెడ్డి, వెంకటేశ్వర్లు ప్రజలను కోరారు. మండల పరిధిలోని యంబాయిలో 'మీ ఓటు విలువ.. ఒక మార్పు' కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రజలకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో జరిగిన అభివృద్ధిని వారు వివరించారు. మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి సారథ్యంలో 25 సంక్షేమ పథకాల ద్వారా ప్రజలకు రూ. 320 కోట్ల లబ్ధి చేకూరిందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు తిరుమలేశ్వర్‌రెడ్డి, యాకోబ్, ఎద్దులన్న, మునిస్వామి, రామనాయుడు పాల్గొన్నారు.

పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



లబ్ధిదారులకు బ్రోచర్ అందజేస్తున్న దృశ్యం

డోన్ టౌన్ : పేదల ఆర్థికాభివృద్ధి, సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ ధేయం అని మీట్ కార్పొరేషన్ చైర్మన్ శ్రీరాములు, ఎంపీపీ రేగటి రాజశేఖర్ రెడ్డి అన్నారు. మండలంలోని కొత్తకోట, నక్కలవాగుపల్లె గ్రామాల్లో శనివారం గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమం నిర్వహించారు. అధికారులు, ప్రజాప్రతినిధులతో కలిసి ఆయా గ్రామాల్లో విస్తృతంగా పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. అదేవిధంగా ఆయా కుటుంబాలకు ప్రభుత్వం నుంచి వర్తించిన సంక్షేమ పథకాల బుక్‌లెట్‌లను లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పార్టీలు, కులమతాలకు అతీతంగా అర్హత కల్గిన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్న ఘనత ఒక్క వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానిదే అన్నారు. డోన్ నియోజకవర్గ అభివృద్ధికి మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి రూ.2400కోట్లు ఖర్చు చేసి మోడల్ నియోజకవర్గంగా తీర్చిదిద్దారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ పథకాలతో ప్రతి ఇంటికి దాదాపు లక్ష వరకు లబ్ధిచేకూరిందని చెప్పారు. అర్హత ఉండి సంక్షేమ పథకాలు పొందని వారు ఇంకా ఎవ్వరైన ఉంటే సచివాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ బద్దల రాజ్‌కుమార్, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ మల్లెంపల్లె రామచంద్రుడు, కొత్తకోట సర్పంచ్ సుదర్శన్‌రెడ్డి, ఉప సర్పంచ్ చంద్రన్న, ఎంపీటీసీ జయమ్మ, వైఎస్సార్‌సీపీ నాయకులు చంద్రశేఖర్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి, రాఘవరెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, కొత్తకోట శ్రీను, భాస్కర్‌రెడ్డి, మంత్రి పీఏ రమేష్ రెడ్డి, ఎంపీడీఓ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలి

కొలిమిగుండ్ల: రామ్‌కో సిమెంట్ యాజమాన్యం నష్టపరిహారం చెల్లించి ఫ్యాక్టరీలో ఉద్యోగం ఇచ్చి ఆదుకోవాలని దివ్యాంగుడు వంకదారి రవికుమార్ కోరారు. శనివారం కొలిమిగుండ్ల క్రాస్ రోడ్డులోని దివ్యాంగుల కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రవికుమార్ మాట్లాడుతూ కల్వటాల సమీపంలోని 317 సర్వే నంబర్‌లోని 2-66 ఎకరాలను ఫ్యాక్టరీ యాజమాన్యం సూచన మేరకు విక్రయించానన్నారు. తనకు ఫ్యాక్టరీలో కాంట్రాక్ట్ పనులతో పాటు రెండు ఉద్యోగాలు కల్పిస్తామని హామీ ఇచ్చారన్నారు. 2022లో వర్క్ ఆర్డర్ ప్రకారం ఇటిక్యాల–చింతలాయిపల్లె రోడ్డులో 2వేల మొక్కలు నాటించానన్నారు. దాదాపు 12 నెలల పాటు పనులు చేయించి దాదాపు రూ.83 లక్షలు ఖర్చు చేశానని వాపోయారు. కాంట్రాక్ట్ పనులకు చెందిన బిల్లు చెల్లించాలని పలు సార్లు అడిగినా కాలయాపన చేస్తూ వచ్చారన్నారు. ఈవిషయంపై జిల్లా కలెక్టర్,ఎస్పీతో పాటు ఇతర అధికారుల దృష్టికి తీసుకెళ్లామన్నారు. ఈవిషయంపై కోర్టును ఆశ్రయించడంతో ఇటీవలనే పోలీసులు కంపెనీకి చెందిన పది మందిపై కేసు నమోదు చేశారన్నారు. తనకు రావాల్సిన బకాయితో పాటు ఉద్యోగ అవకాశం కల్పించాలని కోరారు.

అర్చకుల నిరసన

బనగానపల్లెరూరల్: మండలంలోని పలుకూరు గ్రామంలోని శ్రీరామేశ్వరస్వామి ఆలయానికి సంబంధించిన మాన్యాన్ని కాపాడాలని కోరుతూ శనివారం ఆదిశైవ బ్రాహ్మణ అర్చక సంఘం, విశ్వ హిందూ పరిషత్ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆదిశైవ బ్రాహ్మణ అర్చక సంఘం జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణ శర్మ, విశ్వహిందూ పరిషత్ జిల్లా సహకార్యదర్శి కిశోర్‌కుమార్ మాట్లాడుతూ విలువైన ఆలయ భూమిలో నాపరాయితి యజమానులు వేస్టేజీ వేయడం వలన ఆ భూమి అన్యాక్రాంతం అయ్యే అవకాశం ఉందన్నారు. ఆలయ మాన్యాన్ని సర్వే చేసి, హద్దులు ఏర్పాటు చేసి చుట్టూ కంచవేయాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అర్చక సంఘం నాయకులు యాగంటి మహేష్‌శర్మ, భాస్కరయ్య, పుట్లాలమ్మ సుబ్బరాయశర్మ, మహనంది జనార్దన్, నేలమఠం అర్చకులు శ్రీనివాసచారితదితరులు పాల్గొన్నారు.